కొండవాలులో అభివృద్ధి శూన్యం

- పలు కాలనీల్లో శిథిలావస్థలో రోడ్లు, డ్రైనేజీలు
- కనీస వసతులు లేక నివాసుల ఇబ్బందులు


వరాహగిరి కాలనీ - 2లో డ్రైనేజీల పరిస్థితి ఇదీ


వరాహగిరి కాలనీ - 1లో శిథిలమైన డ్రైనేజీ, రోడ్డు


వరాహగిరి కాలనీ - 1లో అధ్వానంగా తయారైన రోడ్డు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస వసతులు లేకపోవడంతోపాటు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా వుండడంతో భయాందోళనతో జీవిస్తున్నారు. ముఖ్యంగా సత్యసాయి నగర్, వరాహగిరి కాలనీ - 1, వరాహగిరి కాలనీ - 2 ప్రాంతాల్లో సుమారు పది సంవత్సరాల క్రితం నిర్మించిన పాత రోడ్లు, డ్రైనేజీలే నేటికీ ఉన్నాయి. వీటి ఆధునికీకరణ, మరమ్మతుల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన కూడా చేశారు. సుమారు రూ.1.80 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది కూడా... అయితే అనంతరం ఎన్నికల కోడ్, తర్వాత ప్రభుత్వం మారడంతో నేటికీ ఆ పనులు ప్రారంభం కాలేదు.

ఇళ్లలోకి మురుగునీరు

గత ప్రభుత్వ హయాంలో సత్యసాయి నగర్‌లో కొంతమేర డ్రైనేజీలు ఆధునికీకరించారు. పాత డ్రైనేజీల స్థానంలో కొత్తవి మరింత విశాలంగా, లోతుగా, వెడల్పుగా నిర్మించారు. కానీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో పనులు జరగలేదు. దీంతో ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన వర్షాలకు డ్రైనేజీలు నిండిపోవడంతో ఇళ్లలోకి మురుగు నీరు చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు నిర్మించినా వాటిపై కప్పులు మాత్రం నేటికీ వేయలేదు. దీంతో రాత్రి వేళల్లో పిల్లలు, పెద్దలు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరికొన్ని చోట్ల డ్రైనేజీలపై గల పైకప్పులు ప్రమాదకరంగా, వాటి మీద కాలు వేస్తే తిన్నగా కాలువలో పడాల్సిందే అన్నట్లుగా ఉంది పరిస్థితి. వీటి మీదుగా అవతలి వైపు ఇళ్లకు చేరుకోవడం కష్టంగా ఉంది. దీంతో స్థానికులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ కాలనీల్లో కనీసం సామాజిక భవనం కూడా లేదు. ఏదైనా శుభకార్యం చేసుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో స్థానిక గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం కోసం కైలాసపురం, తాటిచెట్లపాలెం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.


వరాహగిరి కాలనీ - 2లో ప్రమాదకరంగా ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

ప్రమాదకరంగా స్తంభాలు

సుమారు పదేళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారడంతో భయం భయంగా గడపాల్సి వస్తోంది. మా కాలనీలో కొన్నిచోట్ల స్తంభాలు ఒరిగిపోయాయి. మా ఇంటి ముందు ఉన్న స్తంభం పడిపోకుండా చెట్టుకు కట్టారు. పొరపాటున ఆ స్తంభం పడిపోతే ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా ఒరిగిన, ప్రమాదకర స్తంభాలు తొలగించాలి.

– ఎం.ధర్మారావు, వరాహగిరి కాలనీ – 2

రోడ్లు, డ్రైనేజీలు శిథిలం

వరాహగిరి కాలనీ – 2లో రోడ్లు వేసి దాదాపు పదేళ్ల పైనే అయింది. ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీలు శిథిలమైపోయాయి. ఇళ్లకు చేరుకునే మెట్ల మార్గాలు భయంకరంగా ఉన్నాయి. కాలనీలో గల శివాలయానికి వెళ్లే మార్గాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ రోడ్డు నిర్మిస్తే శివాలయానికి, మా కాలనీలకు వెళ్లేందుకు చాలా సౌకర్యంగా ఉంటుంది. దూరం కూడా తగ్గుతుంది.

– ఎ.సుధీర్‌కుమార్ శర్మ, వరాహగిరి కాలనీ – 2

త్వరలో పనులు ప్రారంభిస్తాం

జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ– 1, 2, సత్యసాయినగర్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల మార్గాల నిర్మాణ పనులకు మంజూరు లభించింది. త్వరలోనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తారు. ఎన్నికల ముందే సుమారు రూ.1.80 కోట్లు ఈ పనుల కోసం మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయిన పనులు త్వరలో ప్రారంభిస్తారు.

– ఉమా మహేశ్వరరావు, జీవీఎంసీ ఏఈ, 45వ వార్డు

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని కంచరపాలేనికి చెందిన ఎ.కనకరత్నం కుటుంబ సభ్యులు లక్షా 116 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై దాతకు బాండ్‌ను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సాయం


కుట్టు మిషన్ అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ : మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల విద్యార్థుల విద్యాభివృద్ధికి సాయం చేశారు. ఈ మేరకు ఆరోహణ ట్రైబల్ సొసైటీ వ్యవస్థాపకురాలు సురేఖ పట్నాయక్‌తో కలిసి మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు వి.మాడుగుల మండలం కొత్తపల్లి, గొప్పలపాలెం తదితర గ్రామాల బాలబాలికలను గురువారం కలిశారు. వారికి అవసరమైన పుస్తకాలు, స్టేషనరీ, నాలుగు సీలింగు ఫ్యానులు అందించారు. మహిళా క్లబ్ పూర్వ కార్యదర్శి సుశీల, బిందు ఆర్థిక సాయంతో నిరుపేద మహిళ లక్ష్మికి కుట్టు మిషన్ అందించారు. కార్యక్రమంలో యు.ప్రసాద్ పట్నాయక్, ఎ.లక్ష్మి, క్లబ్ ఉపాధ్యక్షురాలు సీహెచ్.వరలక్ష్మి, టి.లీలానాయుడు, కె.మాధవి, డి.శిరీష, ఎం.శేషామణి, కె.సుగుణ, జి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతికి ఆశ్రయం


ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం పొందిన యువతి

సీతమ్మధార : పేరు, ఊరు పేరు చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక యువతిని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని ఒక యువతిని గుర్తించిన వ్యక్తులు ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి గురువారం తరలించారు. గతంలో కూడా ఈమెకు ఇక్కడ ఆశ్రయం కల్పించగా.. పారిపోయిందని నిర్వాహకులు తెలిపారు. ఈమె ఇతరులను దుర్భాషలాడుతోందని... కొన్ని రోజులు యువతి పరిస్థితి గమనించి చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తరలిస్తామని ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు. యువతిని గృహానికి హరి తదితరులు అప్పగించారు.

రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో నాలుగు రోజుల పాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. ఈ వేడుకలు 24వ తేదీ శనివారం నుంచి 27 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ నాలుగు రోజులు శ్రీ కృష్ణుడికి ప్రత్యేక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, 26న కృష్ణాష్టమి సందర్భంగా వేకువజామున మంగళ హారతి, దర్శన హారతి, అఖండ హరినామ సంకీర్తన చేపడుతున్నామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో హెచ్‌టీ లైన్లపై నిర్వహణ, చెట్లు కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అబిద్‌నగర్, అక్కయ్యపాలెం, విద్యుత్‌నగర్, రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతం, లేబర్ ఆఫీస్ ప్రాంతం, ఎన్‌జీజీవోస్ కాలనీ, దుర్గా కైలాస్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీతమ్మధార : ఆశీలుమెట్ట సెక్షన్ ఆఫీసు పరిధిలో 11 కేవీ వుడా కాంప్లెక్స్, 11 కేవీ సీతంపేట ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ జోన్ – 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు టీపీటీ కాలనీ, డాక్టర్ గణేష్‌బాబు ఆస్పత్రి, హిందూ ప్రెస్ కార్యాలయం, ఎన్‌టీఎం న్యాయ కళాశాల, సీతంపేట దుర్గా గణపతి ఆలయం, విజయ మెడికల్ ఏరియా, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

గోపాలపట్నం : మర్రిపాలెం వుడా లే అవుట్ జర్నలిస్టు కాలనీ ఫీడర్ శాంతినగర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు కాలనీ ఫీడర్ పరిధిలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ఏరియా, ఎస్ఏడీ, గౌరీనగర్, గణేష్‌నగర్, శాంతినగర్ ఫీడర్ పరిధి అంబేడ్కర్ నగర్, శాంతినగర్, నేతాజీనగర్, గురజాడ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకం


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ జగదీశ్వరరావు

మల్కాపురం : పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ముఖ్య భూమిక పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ జగదీశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం హెచ్‌పీసీఎల్‌లోని ఎల్ అండ్ టీ సంస్థ ఐఈటీపీ విభాగం ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేట్ స్కూళ్లకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన కొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులు కారణంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా భూగర్భ జలాల రక్షణకు కాలుష్యరహిత వాతావరణానికి మొక్కలు విరివిగా నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సంస్థ ఐఈటీపీ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

సీతమ్మధార : విశాఖపట్నం అభివృద్ధిలో గ్రంథాలయాలూ ముఖ్యమేనని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి మీద అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు. ఇక్కడకు ఎన్నిసార్లు వెళ్తే అన్ని కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత గ్రంథాలయానికి వెళ్లడం మానేయడం సరికాదని హితవు పలికారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు పాత పేపర్లు సాధన చేయడం ద్వారా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ గ్రంథాలయంలో ఎన్నో వేల గ్రంథాలు, మంచి సదుపాయాలున్నాయని నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతను అలవాటు చేద్దాం


గోపాలపట్నం హైస్కూల్‌లో బ్యానర్ ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం : చేతులు శుభ్రం చేసుకునేలా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని ఎంఈవో దివాకర్ సూచించారు. ఈ మేరకు గురువారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల ద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కునేలా చిన్ననాటి నుంచే అలవాటు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా నినాదంతో పత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆటలు, టాయిలెట్లకు వెళ్లి వచ్చిన తర్వాత విధిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ప్రత్యేకంగా రూపొందిచిన మెటీరియల్స్‌తో అవగాహన కల్పించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో ప్రపంచ వాష్ డే, ప్రపంచ టాయిలెట్ డేను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె.నాగంద్ర జోగి, డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రతినిధులు ఏఎస్ కుమారి, ఎం.పుల్లన్న, గోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి


నిరసన తెలుపుతున్న బ్యాంక్ మహిళా ఉద్యోగులు

డాబాగార్డెన్స్: పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోతోందని, మహిళల భద్రతకు తక్షణం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్భయ చట్టం ఉన్నప్పటికీ మహిళలపై ఇటువంటి దాడులు జరగడం హేయనీయమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో మహిళలపై దాడులు నిరోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ సంఘం నాయకులు కమలాకర్, ఆడారి శ్రీను, రమేష్, ఈశ్వర్, ప్రసాద్, సుజాత, ప్రత్యూష, ప్రసన్న లక్ష్మి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం

పాపా హోమ్ చిన్నారులతో సివిల్స్ ర్యాంకర్ పూసపాటి సాహితి


సివిల్స్ 24వ ర్యాంకర్ సాహితిని సత్కరిస్తున్న పాపా హోమ్ కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: సివిల్స్ ఐఎఫ్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించిన పూసపాటి సాహితి గురువారం పాపా హోమ్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో కాసేపు ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్లి బంగారు భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇతర విషయాలు పక్కన పెట్టి కష్టపడి చదివితే అత్యున్నత శిఖరాలు చేరుకోగలరని సూచించారు. పాపా హోమ్ విద్యార్థుల కోసం రూ.10 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సాహితీ అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు సంబంధించి ఏ విషయంలోనైనా తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సాహితీని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పాపా హోం ఉపాధ్యక్షుడు పంపాన వేంకటేశ్వరరావు, కార్యదర్శి వి.ఎస్.ప్రకాశరావు, సభ్యుడు పి.భాస్కర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభకు ప్రోత్సాహం


ప్రతిభా పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, అతిథులు

కంచరపాలెం: విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే దిశగా జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పనిచేస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథా వాచనం మొదలగు ప్రతిభా పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షైజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతోపాటు ప్రతిభను ప్రదర్శించడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. సుమారు 10 కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్.కృష్ణ, డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, పి.రమణిలత, వసంత, సరోజ్‌కుమారి, కో–ఆర్డినేటర్లు జోషిత, దీపిక, నవ్యశ్రీ, రమ్యసాయి, చంద్రిక, డాక్టర్ టి.భాస్కరసుధ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో పువ్వులకు డిమాండ్


సీతమ్మధార రైతుబజారులో పువ్వుల కౌంటర్

సీతమ్మధార : శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా గురువారం ఉదయం నుంచే అధిక సంఖ్యలో వినియోగదారులు సీతమ్మధార రైతుబజార్‌కి వచ్చి పువ్వులు, కూరగాయలు, పూజకు అవసరమయ్యే వస్తువులు కొనుగోలు చేశారు. డిమాండ్ పెరగడంతో పువ్వుల ధరలు పెరిగిపోయాయి. కిలో చామంతి (హైబ్రీడ్) రూ.400, బంతి రూ.150, గులాబీ ఎరుపు రూ.250, పసుపు రూ.250 వంతున విక్రయించారు. బంతి పువ్వుల దండలు రూ.50 చొప్పున విక్రయించారు. మూర మల్లె పువ్వులు రూ.80కి, కనకాంబరాలు రూ.100కి విక్రయించారు. పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజల సందర్భంగా అధిక పరిమాణంలో పువ్వులు కొనుగోలు చేశారు. కూరగాయలతోపాటు చెరకు గడలు, ఆపిల్, కొబ్బరికాయలు, అరటిపండ్లు, పలురకాల పళ్లు, అరటి ఆకులు కొనుగోలు చేశారు. రైతుబజార్ సహాయకుడు సతీష్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

కార్మికులపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలి

మహాధర్నాలో స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకుల డిమాండ్


ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముందు ధర్నా చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం బలవంతపు ఆర్థిక ఆంక్షలు ఉపసంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతకాని వైఖరి వల్ల పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపలేకపోతున్నారన్నారు. ముడి పదార్థాలు సమకూర్చలేని పరిస్థితిలో యాజమాన్యం ఉండడం సిగ్గుచేటన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే ప్లాంట్ మనుగడ సాధిస్తుందన్నారు. అదే విధంగా నిర్వాసితుల ఉపాధి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

వేతనాలు పెంచకపోగా.. కోతలా!

సెయిల్‌తో సమానంగా వేతన సవరణ జరగాల్సి ఉండగా ఇక్కడ ఉన్న వేతనాలపై ఆంక్షలు విధించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఉక్కు యాజమాన్యం ప్రతీ నెలా సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు ఆర్థిక ఆంక్షల ప్రతిపాదనను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లోకి నాయకులు వెళ్లకుండా పెద్ద ఎత్తున పోలీసు సిబ్బందిని మోహరించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ధర్నాలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు.